జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

విజయనగరం రూరల్, మార్చి 27: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ప్రతిమూడు నెలలకొకసారి జరిగే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి ఈ సారి సభ్యులెవరూ రాలేదు. ఎన్నికల కోడ్ కారణంగా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, జడ్పీటీసీ, ఎంపీపీలు హాజరుకాలేదు. అధికారులు కూడా అతి తక్కువ సంఖ్య లో వచ్చారు. విజయనగరం జడ్పీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉంది. అయితే జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీధర్‌రాజా 11.30 గంటల వరకు నిరీక్షించారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు.

నిధులు లేక.. పనులు సాగక!

● ఉమ్మడి జిల్లాలో నిలిచిన ఏడు రోడ్ల నిర్మాణాలు ● ఐదున్నర నెలలే గడువు..
● రూ. 47.81 కోట్ల మేర బిల్లులు పెండింగ్ ● ఇబ్బందుల్లో ప్రజలు

(జియ్యమ్మవలస)

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రహదారులు ఎంతో కీలకం. అయితే వాటి నిర్మాణం విషయం దేవుడెరుగు.. ఐదేళ్ల కాలంలో రోడ్ల మరమ్మతులపై కూడా వైసీపీ సర్కారు పెద్దగా దృష్టి సారించలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ఎంత అధ్వానంగా మారాయో.. అడుగుకో గొయ్యితో ఎంత ప్రమాదకరంగా మారాయో.. వేరేగా చెప్పనవసరం లేదు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో కొత్తగా మంజూరైన రహదారుల నిర్మాణాలనూ సర్కారు పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ నిర్మాణాలన్నీ నిలిచిపోయాయి. మొత్తంగా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి జిల్లావాసులకు అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎప్పటికి బిల్లులు మంజూరవుతాయి.. ఇంకెప్పటికీ ఈ రోడ్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణాల పూర్తికి ఐదున్నర నెలల గడువు ఉన్నందున.. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి జిల్లాలో 2021, మార్చి 28న ఏడు స్టేట్ హైవే రోడ్లు మంజూరయ్యాయి. వీటిని నిర్మించేందుకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ బీవీఎస్ఆర్ కనస్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 139.43 కోట్ల అగ్రిమెంట్‌తో ముందుకు వచ్చింది. ఏకకాలంలో నిర్మాణాలు ప్రారంభించింది. అయితే కొన్ని చోట్ల పనులు దాదాపు పూర్తవ్వగా, మరికొన్ని చోట్ల మధ్యలో నిలిచి పోయాయి. వాస్తవానికి ఈ రహదారుల నిర్మాణాలు 2023, మార్చి 27 నాటికి పూర్తికావాల్సి ఉంది. కానీ చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు కాకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ ఈ విషయాన్ని అధికారులకు తెలియ జేయడంతో రోడ్డు నిర్మాణాల గడువును 2024, సెప్టెంబరు 17 వరకు పొడిగిస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇంతవరకు రూ. 55.34 కోట్ల విలువైన పనులు జరిగితే, ఇందులో రూ. 47.81 కోట్ల మేర బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉండి పోయాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆయా రోడ్ల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాగా గడువు నాటికి రహదారుల నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు.

విజయనగరం డివిజన్‌లో...

విజయనగరం డివిజన్‌లో 42 కిలో మీటర్ల మేర నాలుగు రోడ్ల నిర్మాణానికి రూ. 105.04 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించింది. ఆ తరువాత రూ. 96.71 కోట్లతో సాంకేతిక అనుమతి లభించింది. ఈ మేరకు రూ. 26.82 కోట్ల విలువైన పనులు జరిగినప్పటికీ.. రూ. 22.90 కోట్ల మేర బిల్లులు చెల్లింపులు జరగలేదు. దీంతో కాంట్రాక్టరు చేతులెత్తేశారు. మొత్తంగా ఆయా రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయంటే..

● గజపతినగరం - జిన్నాం - గడసాం - పొరలి రోడ్డు స్టేట్ హైవే-124 పరిధిలో ఉంది. మొత్తం 17.623 కిలో మీటర్ల ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 45.16 కోట్లు మంజూరు చేశారు. అయితే రూ. 8.97 కోట్ల మేర పనులు మాత్రమే జరిగాయి. రూ. 6.51 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

● చింతపల్లి - విజయనగరం రోడ్డు స్టేట్ హైవే-147 పరిధిలో ఉంది. 3.92 కిలో మీటర్ల ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 8.70 కోట్లు మంజూరయ్యాయి. కానీ ఇక్కడ రూ. 45 లక్షలు విలువైన పనులు మాత్రమే జరగ్గా.. రూ. 36 లక్షల మేర బిల్లు పెండింగ్‌లో ఉంది.

● స్టేట్ హైవే-134 పరిధిలో 4.19 కిలో మీటర్ల మేర విజయనగరం - భీమసింగి - కొత్తవలస రోడ్డు నిర్మాణానికి రూ. 7.48 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ. 4.15 కోట్లు పనులు జరగ్గా ఇంకా రూ. 3.17 కోట్ల మేర బిల్లు పెండింగ్‌లో ఉంది.

● స్టేట్ హైవే-140 పరిధిలో 16.587 కిలో మీటర్ల మేర సోంపురం - ఆనందపురం రోడ్డు నిర్మాణానికి రూ. 35.37 కోట్లు మంజూరయ్యాయి. అయితే రూ. 13.25 కోట్ల విలువైన పనులు జరగ్గా రూ. 12.86 కోట్ల మేర బిల్లు పెండింగ్‌లో ఉంది.

పార్వతీపురం డివిజన్‌లో...

పార్వతీపురం డివిజన్‌లో 48.44 కిలో మీటర్ల మేర మూడు ప్రధాన రోడ్లు నిర్మాణాలకు రూ. 134.84 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించింది. ఇందులో రూ. 125.18 కోట్లకు సాంకేతిక అనుమతులు లభించాయి. అయితే ఈ మూడేళ్లలో రూ. 28.52 కోట్ల విలువైన పనులు జరిగాయి. కాగా అందులో రూ. 24.91 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కాంట్రాక్టరు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ మూడు రోడ్ల పరిస్థితి ఒక్కసారి పరిశీలిస్తే..

● కురుపాం నియోజకవర్గం పరిధిలో తోటపల్లి - గుణుపురం రోడ్డు స్టేట్ హైవే-081 పరిధిలో ఉంది. ఈ రోడ్డులో 14 కిలో మీటర్ల పనులకు గాను రూ. 35.37 కోట్లు మంజూరయ్యాయి. రూ. 19.17 కోట్లు విలువ గల పనులు జరిగితే రూ. 16.50 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

● సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల పరిధిలో మక్కువ - అజ్జాడ రోడ్డు స్టేట్ హైవే-003 పరిధిలో ఉంది. ఈ రోడ్డులో 15.480 కిలో మీటర్ల పనులకు రూ. 38.40 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు రూ. 4.53 కోట్ల మేర పనులు జరిగ్గా, రూ. 3.95 కోట్ల మేర బిల్లు పెండింగ్‌లో ఉంది.

● సాలూరు నియోజకవర్గం పరిధిలో సాలూరు - దుగ్గేరు వయా మక్కువ రోడ్డు స్టేట్ హైవే-100 పరిధిలో ఉంది. 19.15 కిలో మీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 55.56 కోట్లు మంజూరయ్యాయి. అయితే రూ. 4.82 కోట్ల మేర పనులు జరిగితే రూ. 4.46 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

మంజూరుకు పంపించాం

ఉమ్మడి జిల్లాలో మంజూరైన ఏడు ప్రధాన రహదారుల నిర్మాణాలు కొంత వరకు జరిగాయి. అయితే రూ. 47.81 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సిన మాట వాస్తవమే. ఇది సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉంది. బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించాం.

– జీవీ రమణ, ఆర్అండ్‌బీ ఈఈ, విజయనగరం డివిజన్


కురుపాం నియోజకవర్గంలో మధ్యలో నిలిచిపోయిన తోటపల్లి - గుణుపురం రోడ్డు


పెదమేరంగి జంక్షన్ వద్ద రోడ్డు పరిస్థితి ఇదీ..

ముగిసిన టెన్త్ పరీక్షలు

సాలూరు రూరల్, మార్చి 27: జిల్లాలో ఈ నెల 18 నుంచి జరుగుతున్న పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. మొత్తంగా 66 కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. దాదాపు 10,686 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,578 మంది పరీక్ష రాశారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్ష నిర్వహించారు. చివరి రోజున సాంఘికశాస్త్రం పరీక్ష జరిగింది. కాగా పరీక్షలన్నీ ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల్లో పారదర్శకత కోసం ఫ్లయింగ్ స్క్వాడ్లు సంచరించాయి. సిట్టింగ్ స్క్వాడ్లు సీ-కేంద్రాలను పర్యవేక్షించాయి. జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. కాగా పరీక్షలు ముగియడంతో విద్యార్థుల ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. వారి ముఖాలు మెరిసిపోతూ కనిపించాయి. కేంద్రాల నుంచి ఎంతో ఉత్సాహంగా వారు బయటకు వచ్చారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా స్నేహితులందరితో ముచ్చటించారు. పరీక్ష కేంద్రాల బయట కాసేపు సందడి చేశారు.


సాలూరులో పరీక్ష కేంద్రం బయట విద్యార్థులు ఇలా..

అనుమానంతోనే..

● మహిళ హత్య కేసులో భర్త అరెస్ట్
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణారావు

జియ్యమ్మవలస, మార్చి 27 : మండలంలో చింతలబెలగాం పంచాయతీ సింగనాపురం గ్రామంలో ఈ నెల 22న మహిళను హతమార్చిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను బుధవారం సాయంత్రం చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ జీవీ కృష్ణారావు వెల్లడించారు. తాగుడుకు బానిసైన ముసలినాయుడు అనుమానంతోనే భార్య గంటా అప్పల నర్సమ్మ (60)ను హతమార్చాడని ఆయన తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అప్పలనర్సమ్మను హత్య చేసిన అనంతరం కొండచిలకాం పంచాయతీ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలోకి నిందితుడు పారిపోయాడని తెలిపారు. చినమేరంగి సీఐ బి.మంగరాజు, చిన మేరంగి ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, జియ్యమ్మవలస ఎస్ఐ పి.అనీష్, పోలీస్ సిబ్బంది ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారన్నారు. చివరకు తాళ్లడుమ్మ పంచాయతీ లక్ష్మీపేట వద్ద నిందితుడిని పట్టుకున్నారని వెల్లడించారు. ముసలినాయుడుపై 302 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి పార్వతీపురం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని చెప్పారు. నిందితుడిని చాకచక్యంగా పట్టు కున్న సీఐ, ఎస్ఐను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారన్నారు. సమావేశంలో డీఎస్పీ సీసీ రాజారావు, హెచ్‌సీ సోములు, కానిస్టేబుళ్లు రాజేష్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

ఆదేశాలు సరే.. పైసలేవీ?

● కోడ్ నేపథ్యంలో పంచాయతీల్లో అన్నీ తొలగించాలంటున్న అధికారులు
● నిధులు మంజూరుపై స్పష్టత ఇవ్వని వైనం
● కార్యదర్శులకు చేతి చమురు వదులుతున్న వైనం

(గరుగుబిల్లి)



జిల్లా పరిధిలోని పలు పంచాయతీల కార్యదర్శులకు కాసుల కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల నిబంధనల కారణంగా వారికి చేతి చమురు వదులుతోంది. కోడ్ నేపథ్యంలో గ్రామస్థాయిలో పలు నిర్మాణాలకు ఉన్న రాజకీయ పార్టీల రంగులు చెరపాలని, స్టిక్కర్లను తొలగించాలని రిటర్నింగ్ అధికా రులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రధానంగా రైతుభరోసా కేంద్రాలు, రక్షిత పథకాలు, సచివాలయాలు, విద్యుత్ స్తంభాలకు ఉన్న వైసీపీ పోలిన రంగులు, ప్రతి ఇంటికి ఉన్న సీఎం జగన్ చిత్రాలతో ఉన్న స్టిక్కర్లు, ప్రధాన రహదారులపై ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని చెబుతున్నారు. అయితే తొలగింపునకు సంబంధించి ఎటువంటి మొత్తాలు పంచాయతీలకు కేటాయించడం లేదు. ప్రతి పంచాయతీలో స్టిక్కర్ల తొలగింపుతో పాటు రంగులు మార్చేందుకు గాను పంచాయతీ కార్యదర్శులకు సుమారు రూ. 5 వేలకు పైగానే ఖర్చు అవుతుంది. సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేయడం తప్ప నిధుల విషయమై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదు. జేబులో డబ్బులు తీసి ఆయా పనులు చేపట్టాల్సి వస్తోంది. మరోవైపు ఉన్నతా ధికారుల ఆదేశాలను ధిక్కరించలేక కొంతమంది తలలు పట్టుకుంటున్నారు. ఇంకొందరు అప్పులు చేసి మరీ తొలగింపు చర్యలు చేపడుతున్నారు. ఖర్చుల విషయంపై కొన్ని చోట్ల మండల అధికారులు, కార్యదర్శులకు మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఏదేమైనా సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు పంచాయతీల్లో నిర్వహించిన పనులకు అవసరమైన మొత్తాలను విడుదల చేస్తేనే కార్యదర్శులకు కాస్త ఊరట కలగనుంది.



ప్రత్యేకంగా నిధులు మంజూరు లేదు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంచాయతీల్లో పలు కార్యక్రమాలు నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు మంజూరు లేదు. ప్రత్యేక బడ్జెట్ కూడా కేటాయించలేదు. ఆర్థిక సమస్యలతో కార్యదర్శులు సతమత మవుతున్నారు. ఈ సమస్యను రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మండల అధికారి, గరుగుబిల్లి

ఎన్నికల ఏర్పాట్లపై నిర్లక్ష్యం వద్దు

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

గరుగుబిల్లి, మార్చి 27 : సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల ఆవరణలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాలకు చెందిన ఓట్లు లెక్కింపు కార్యక్రమం ఈ కళాశాల ఆవరణలోనే జరగనుందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులకు సంబంధించి అవసరమైన స్ట్రాంగ్ రూములకు ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. వాహనాలకు సంబంధించి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాల న్నారు. మీడియా కేంద్రం, సీసీ కెమెరాలతో పాటు పలు సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు అందించారు. నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సౌకర్యాల విషయంలో అలసత్వం పనికిరాదన్నారు. గ్రామ, మండల స్థాయిలో నియమించిన అధికారులు ఎప్పకటిప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పీవోలు విష్ణుచరణ్, కల్పనాకుమారి, ఆర్డీవోలు కె.హేమలత, వీవీ రమణలు, సర్వే అధికారి కె.సూర్యారావు, తహసీల్దార్ కె.జయ, మండల సర్వేయర్లు , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా

పార్వతీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి అని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు 48 గంటల ముందుగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకో వాల్సి ఉందన్నారు. అలా వీలు కాని పక్షంలో కొన్ని అత్యవసర పరిస్థితుల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఇవ్వొచ్చన్నారు. కాగా ఆ వివరాలన్నింటినీ ఎన్కోర్ పోర్టల్‌లో నమోదు చేసి సకాలంలో అనుమతులు జారీ చేయాలని అధి కారులకు సూచించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో పాటు ఏపీ పురపాలక, స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ చట్టాలను పరిగణనలోనికి తీసుకొని అనుమతులు మంజూరు చేయాలన్నారు. సి-విజిల్ యాప్‌లో నమోదయ్యే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించా లని ఆదేశించారు. ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫ రెన్స్‌లో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలు విష్ణుచరణ్, కల్పనా కుమారి, జాయింట్ కలెక్టర్ శోభిక తదితరులు పాల్గొన్నారు.


పాలకొండలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పీవో

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

పాలకొండ: పాలకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. స్ట్రాంగ్ రూమ్‌కు అవసరమయ్యే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వర్షం పడినా నీరు లోపలకు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. పక్కాగా పనులు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ వరహాలు, డీటీ, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు

● ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం రూరల్: జిల్లావాసులు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం నేర సమీక్ష నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగిం చుకునేలా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యాత్మక గ్రామాలు, అతి సమస్యాత్మక గ్రామాలను సందర్శించాలని సిబ్బందికి సూచించారు. సరిహద్దు, చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సారా, మద్యం, నగదు అక్రమ తరలింపుపై నిఘా పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు ఇతర కేసులపై సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల బందోబస్తు కోసం వచ్చిన కేంద్ర పోలీస్ దళం , ఆర్‌పీఎఫ్ ఫోర్స్‌తో జిల్లాలో ఉన్న పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందితోనూ వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభకనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు.


మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆ రంగులకు సున్నాలు వేస్తారో.. లేదో?

పార్వతీపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ భవనాలకు వైసీపీ పోలిన రంగులు ఉంటే వాటికి సున్నాలు వేస్తున్నారు. అదే విధంగా శిలాఫలకాలపై నాయకులు, సీఎం ఫోటోలు కనిపించకుండా ముసుగులు వేస్తున్నారు. కానీ జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి లేదు. తాజాగా బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ఇదే అంశంపై చర్చించినట్లు తెలిసింది. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ భవనాలకు వైసీపీ పోలిన రంగులు ఉన్నా, పాత శిలాఫలకాలపై నాయకుల ఫోటోలు ఉన్నా.. కోడ్ నిబంధనల ప్రకారం వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించినట్టు సమాచారం. అయితే ఇకనైనా అధికారులు వాటిని తొలగిస్తారో లేదో చూడాల్సి ఉంది. అయితే దీనిపై తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని జిల్లా మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అధికారి ఎండీ గయాజుద్దీన్‌ను తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత జిల్లాలో కొత్తగా శిలఫలకాలు, రంగులు వేయకూడదని చెప్పారు. పక్కాగా జిల్లాలో కోడ్‌ను అమలు చేస్తున్నామన్నారు.

నేడు బలిఘట్టంలో టీడీపీ ప్రచారం

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని కొత్తవలస మేజరు పంచాయతీ పరిధిలో గల బలిఘట్టం గ్రామంలో గురువారం సాయంత్రం ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి ప్రచారం చేపట్టనున్నట్టు పార్టీ పెద్దలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో తొలిసారిగా చేపట్టనున్న ప్రచార కార్యక్రమానికి టీడీపీ-జనసేన-బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవ్వాలని టీడీపీ కార్య దర్శి కనకల శివ కోరారు. ప్రచారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరించండి

వేపాడ: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వల్లంపూడి గ్రామానికి చెందిన దుడ్డు చిట్టిరాజు ఆయిల్ మిల్లు ఆవరణలో బుధవారం నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.

నేడు తెలుగు యువత సమావేశం

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ తెలుగు యువత సమావేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలుగు యువత అధ్యక్షుడు గంటా రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్, కలలకు రెక్కలు, సోషల్ మీడియా ద్వారా టీడీపీ విస్తృత ప్రచారం వంటి కార్యక్రమాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

పీవో, ఏపీవోలకు శిక్షణ

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఈ నెల 28, 30 తేదీలలో పోలింగ్ అధికారులకు, ఏపీవోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు త్రినాథరావునాయుడు తెలిపారు. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల 300 మందికి శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.

సెలవు రోజుల్లోనూ పన్నుల వసూలు

● మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు సమీపిస్తున్నందున ఆస్తిపన్ను వసూలు లక్ష్యాల ను ముమ్మరం చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. కంచరవీధి, పూల్ బాగ్, కుమ్మరి వీధి, రావువారివీధి, మల్లమ్మపేట సచి వాలయాల పరిధిలో వసూలు ప్రక్రియ మందకొడిగా ఉందన్నారు. ఈ నెల 29న గుడ్ ఫ్రైడే, 31న ఆదివారం సెలవు దినాలైనప్పటికీ మున్సిపల్ కార్యాలయంలో గల పన్నుల వసూలు కౌంటర్ తెరిచే ఉంటుందని తెలిపారు.

బేబీనాయనకు కళాసీల మద్దతు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ కళాసీ సంఘ అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి, ఇతర పెద్దల ఆధ్వర్యంలో 13 జట్లకు చెందిన సుమారు 250 మంది కళాసీలు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయనకు మద్దతు ప్రకటించారు. సంఘ నాయకులు పైల రామకృష్ణ, పిరిడి అప్పారావు, ఎరబాల అప్పారావుల నాయకత్వంలో వారంతా బుధవారం బొబ్బిలి కోటకు వచ్చి బేబీనాయనకు మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ కష్టసుఖాలలో పాలు పంచుకుంటానని హామీ ఇచ్చారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

తెర్లాం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పెరుమాళి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జి.జ్యోతిలక్ష్మి కోరారు. ఈ నెల 28 నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఓటర్లకు అవగాహన

బాడంగి: వాడాడ, పాల్తేరు గ్రామాల్లోని ప్రజలకు బుధవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రాజారావు, ఎంపీడీవో అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

25వ డివిజన్‌లో జయహో ఎస్సీ

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్ సున్నపు బట్టీలు ప్రాంతంలో టీడీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు 'జయహో ఎస్సీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మామిడి రవి శంకర్, కండువా ప్రకాష్, శంకరరావు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకి గ్యారెంటీ'పై ప్రచారం

విజయనగరం రూరల్: నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోని స్వీపర్ వీధి, వేణుగోపాలపురం తదితర ప్రాంతాల్లో బుధవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పార్టీ నాయకులు మురగడాపు పార్వతి, నక్కిళ్ల శ్రీనివాసరావు, బొద్దాన లక్ష్మణ్, ఆవాల రోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఒకటో డివిజన్ పరిధిలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అదితి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నగర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

శృంగవరపుకోట రూరల్: రేవళ్లపాలెంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన చిటికిరెడ్డి అర్జున కుటుంబానికి వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. ఎంపీపీ సోమేశ్వరరావుతో కలసి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సాయం అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట సర్పంచ్ సంతోషి కుమారి, ఎంపీటీసీ వాకాడ సింహాచలం, నాయకులు రామకృష్ణ, జ్యోతి, సతీష్, చామాలపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రేపు గుడ్ ఫ్రైడే ర్యాలీ

విజయనగరం దాసన్నపేట: నగరంలోని సిటీ చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 29న జరగనున్న గుడ్ ఫ్రైడే ర్యాలీని క్రైస్తవులు విజయవంతం చేయాలని ఫాదర్ జాన్ మోజెస్ కోరారు. బుధవారం నగరంలోని కేఎల్‌పురం, కణపాక, కంటోన్మెంట్ ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభం

జామి: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి బుధవారం జామిలోని ఎల్లారమ్మ ఆలయంలో పూజలు చేసి శంఖారావం..సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికి.. కలప తరలించారు

● అనుమతి లేకుండా కటింగ్ ఆర్డర్

● ఇదీ రాజాం అగ్నిమాపక కేంద్రం అధికారుల తీరు



అగ్నిమాపక కేంద్రం ఆవరణలో నరికిన నీలగిరి చెట్లు

రాజాం: రాజాం అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఉన్న రూ. లక్షలు విలువచేసే చెట్లను నరికేసి రూ.వేలల్లో ఖర్చు చేసి కంచె వేయడం విశేషం.ఇటీవల సుమారు 80 టన్నుల వరకు నీలగిరి, టేకు, నిద్రగన్నేరుచెట్లు ఎటువంటి అనుమతి లేకుండా గోప్యంగా నరికేసి చిలకపాలెంకు చెందిన కలప వ్యాపారి తరలించారు. టన్ను సుమారు 6 నుంచి 7 వేలు వరకు ఉంటుందని మొత్తం విలువ రూ.5 లక్షల 60 వేలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే చెట్లను తొలగించ డానికి ముందుగా రెవెన్యూ అధికారులు అనుమతి, అనంతరం జిల్లా అటవీశాఖ అధికారులు నుంచి చెట్లు తొలగించడానికి కటింగ్ ఆర్డర్ తీసుకోవాల్సిఉంది. అయితే అటువంటి చర్యలు ఏమి చేపట్టకుండా అగ్నిమాపక శాఖ అధికారులు చెట్లు తొలగించడంపై విమర్శలొస్తున్నాయి. అగ్నిమాక శాఖ కార్యాలయం ఆవరణలో చుట్టు కంచె వేయడానికి రూ.లక్ష వరకు మాత్రమే ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. కార్యాలయం వెనుక భాగంలో ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారికి చెందిన స్థలం ఉండడం తో ఇక్కడి చెట్లు తొలగించారన్న ఆరోపణలొస్తున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే చెట్లను రాజాంలో ఉన్న కలప వ్యాపారులకు విక్రయించకుండా బయట వ్యాపారులకు అమ్మకంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్థానిక వ్యాపారులైతే చెట్లు విలువ కంచె వేయడానికి అయిన ఖర్చు కూడా తెలుస్తుందని గోప్యంగా అమ్మకాలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై అగ్రిమాక శాఖ అధికారి జనార్దనరావును ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరని సిబ్బంది సమాధానం చెప్పారు. అలాగే ఈ విషయంలో జిల్లా అటవిశాఖ రెంజ్ అధికారి అప్పలరాజు వద్ద ప్రస్తావించగా చెట్లను తొలగిస్తున్న విషయంపై ఎటువంటి సమాచారం లేదని, సిబ్బందిని పంపించి పరిశీలించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న సీఐ

విజయనగరం క్రైం: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ కోరాడ రామారావు హెచ్చరించారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని దాసన్న పేట, లంకవీధి, రాజీవ్‌నగర్ కాలనీ, కాటవీధి ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో బుధవారం కవాతు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలన్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించే వారిని గుర్తించి కౌన్సిలింగ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ దుర్గాప్రసాద్, కేంద్ర బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులులేని ఓటరు జాబితా కోసం కృషి చేయండి



4వ డివిజన్‌లో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రసాదుల ప్రసాద్

విజయనగరం రూరల్: తప్పులు లేని ఓటరు జాబితా కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ చెప్పారు. నగరంలో ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని ఆయన బుధవారం నాలుగో డివిజన్ మంగళవీధి కాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలన కోసం పార్టీ రెండు డివిజన్లకు ఒక సమన్వయ కర్తను నియమించిందన్నారు. వీరితో క్షేత్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. 7వ డివిజన్‌లో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనక మహాలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు పూసర్ల లక్ష్మి తదితరులు హాజరయ్యారు. 13వ డివిజన్‌లో కోన కిషోర్, 49వ డివిజన్‌లో కార్పొరేటర్ కర్రోతు రాధామణి, నాయకుడు నడిపిల్లి రవికుమార్‌లు జాబితాలను పరిశీలించారు. 45వ డివిజన్‌లో కోరాడ వెంకటరావు ఆధ్వర్యంలో జాబితాలు పరిశీలించారు.

నేడు ఎల్లమ్మ పండగ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): గంగచోళ్లపెంట గ్రామంలో కొలువైన ఎల్లమాంబ పండగ నేడు జరగనుంది. ఇందుకు సంబంధించి గ్రామ సర్పంచ్ బోని సంగమయ్య, ఎంపీటీసీ కనకల పైడన్న ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం ఉదయం నుంచి ఎల్లమ్మ అమ్మవారికి పసుపు కుంకుమలు, సారె.. చీరలు భక్తులు సమర్పించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తెలిపారు.



గంగచోళ్లపెంటలో ఎల్లమాంబ

శిలాఫలకాలపై చిత్తు కాగితాల తొలగింపు



శిలాఫలకాలపై చిత్తుకాగితాలు తొలగించి ఖాళీ అట్టలు అతికిస్తున్న దృశ్యం

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల శిలాఫలకాలపై మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ, మండల పరిషత్ అధికారులు చిత్తు కాగితాలను అతికించి వాటిని మూసివేసిన సంగతి తెలిసిందే. ఆ చిత్తు కాగితాలపై కూడా సీఎం జగన్‌తో పాటు ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు, ప్రభుత్వ పథకాల ప్రకటనలు ఉండడంతో అధికారులు వాటిపై పునరాలోచన చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంతో పాటు వివి ధ ప్రాంతాల్లో గల శిలాఫలకాలపై ఉన్న చిత్తు కాగితాలను బుధవారం తొలగించారు. వాటిపై వెంటనే ఖాళీగా ఉన్న పలుచటి అట్టలు లాంటివి అతికించారు. గ్రామాల్లో గల శిలాఫలకాలు, ఇతర బోర్డులపై సున్నాలు వేసి పూర్తిగా మూయించాలని ఎంసీసీ ప్రతినిధి, ఎంపీడీవో రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు.

రామచరణ్ పుట్టిన రోజు వేడుకలు

విజయనగరం దాసన్న పేట, మార్చి 26: సినీ హీరో రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా ని ర్వహించారు. నగరంలోని అన్ని దేవాలయాల్లో, చర్చిలో నూ సర్వమత ప్రార్థనలు నిర్వ హించారు. నిరాశ్రయుల వసతి గృహంలో ఆలహారాన్ని అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని జీఎస్సార్ హోటల్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన నాయకులు గురాన అయ్యలు హాజరయ్యారు. పిళ్లా విజయ్‌కుమార్, ఆదాడ మోహనరావు, రామచంద్రరాజు, జ్యోతి, రాజేష్, గొల్ల పల్లి మహేష్, రాజేష్, కె సత్యం తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు, జిల్లా చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి లంక రమేష్, అవేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్దింటి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. 72 మంది అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బొబ్బిలిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో గల వివిధ పోలింగ్ కేంద్రాలను కమిషనర్ లాలం రామలక్ష్మి బుధవారం తమ అధికారులతో కలిసి పరిశీలించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి వరప్రసాద్, ఏఈలు రవి, సురేష్, బీఎల్‌ఓలతో మాట్లాడి పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

పేదల ద్రోహి సీఎం జగన్



కింజంగిలో పర్యటిస్తున్న కోండ్రు

వంగర: సీఎం జగన్ పేదల ద్రోహి అని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. బుధవారం సీతాదేవిపురం, కొత్తమరువాడ, పాతమరువాడ కింజంగిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసుదేవరావు నాయుడు, కృష్ణమూర్తి, దుర్గాబాబు, బి.రవి, శ్రీనివాస్, మోహన్, ఆవు తిరుపతి, బి.రాంబాబు, త్రినాథ పాల్గొన్నారు. ● **రాజాం:** రాజాంలో 450 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. మునిసిపాలిటీ పరిధిలోని కొత్తవలసకు చెందిన 150 , కంచరాంకు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యులు టంకాల పాపి నాయుడు, రౌతు రామి నాయుడు ఆధ్వర్యంలో 200, వీఆర్ అగ్రహారంలో 50, వంగర మండలం మడువలసకు చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ సమక్షంలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే సామాజిక న్యాయం జరుగు తుందన్నారు. టీడీపీ నాయకులు వంగా వెంకటరావు, దుప్ప లపూడి శ్రీనివాసరావు, శిమ్మ జగన్నాథం, రౌతు వెంకటరమణ, రగుమండల గణపతినాయుడు, మాడుగుల జయరాం, టంకాల కన్నంనాయుడు, పిల్లా సత్యంనాయుడు, జె.నీలయ్య, టంకాల నాగరాజు, ఆటో కోటి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలో చేరిన వేపాడ మండలం పీకేఆర్.పురం గ్రామస్థులు

లక్కవరపుకోట: వేపాడ మండలం పెదకృష్ణరాజపురం గ్రామానికి చెందిన వైసీపీలోని వంద కుటుంబాలు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో వైసీపీ మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు టీడీపీ కండువాలు వేసుకున్నారు. పెద కృష్ణరాజపురం మాజీ సర్పంచ్ మమ్ములూరి రామచంద్రుడు, మంగయ్యమ్మ సారథ్యంలో అనుచర వర్గమంతా ర్యాలీగా వచ్చి ఎల్.కోటలో టీడీపీలో చేరారు. వైసీపీ పాలనలో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని.. అందుకనే టీడీపీలో చేరామని వారు పేర్కొన్నారు. పెదకృష్ణరాజపురం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని రాంప్రసాద్ హామీ ఇచ్చారు. టీడీపీలో చేరిన వారిలో అవగడ్డ మల్లునాయుడు, ఎస్.అప్పలనాయుడు, ఎం.ఈశ్వరరావు, ఎం.వెంకటరావు, ఎ.జగ్గి, త్రినాథ్, సన్యాసినాయుడు, ఎస్.ఈశ్వరరావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వేపాడ మండల టీడీపీ నేతలు కె.రమణమూర్తి, దాసరి లక్ష్మి, బి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట(కొత్తవలస): మండలంలోని గులివిందాడ గ్రామంలో వైసీపీకి చెందిన 200 మంది కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి సమక్షంలో బుధవారం వైసీపీ నేతలు గవర సూర్యప్రకాష్, జి.శివశంకరరావు, సోములమ్మ ఆధ్వర్యంలో 200 మంది టీడీపీలో చేరారు. గులివిందాడ భూముల రక్షణ, కొత్తవలస-సబ్బవరం రోడ్డు నిర్మాణం చేపట్టాలని లలితకుమారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.పైడిరాజు, జి.ముత్యాలనాయుడు, శంకరరావు, జామి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్.కోటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

శృంగవరపుకోట: శృంగవరపుకోట గాయత్రీ మాత ఆలయ సమీపంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యా లయాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తు న్న కార్యాలయాన్ని విశాఖ పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి ఎం.శ్రీభరత్ గురువారం ఉదయం 9 గంటలకు ప్రా రంభిస్తారన్నారు. ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ, జామి, కొత్తవలస మండలాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసే న నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మా తాగునీరు వారికి ఇవ్వొద్దు

● మోసూరువలస గిరిజనుల ఫిర్యాదు

బొబ్బిలి: 'ఎగువ ప్రాంతంలో ఉన్న మా గిరిజన గ్రామానికి చెందిన తాగునీటిని దిగువ ప్రాంతంలో వలస వచ్చిన వారికి అందజేస్తే మా సంగతేంటి?' అని గిరిజనులు వాపోతున్నారు. మోసూరువలసకు చెందిన ఉపసర్పంచ్ జె.ఆదయ్య నాయకత్వంలో గిరిజనులంతా బుధవారం స్థానిక ఎంపీడీఓ రవికు మార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి తాగునీటిని దిగువ ప్రాంతంలో గల కొన్ని వలస కుటుంబాల వారికి అనధికారికంగా పంపిణీ చేస్తున్నారని అన్నారు. పాచిపెంట మండలం చంద్రిమానివలస గ్రామస్తులు జీవనోపాధి కోసం మోసూరువలస సమీపంలో గల పొలాల్లో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. వారి కోసం ప్రైవేటు వ్యక్తులు ప్లాస్టిక్ ట్యాంకును ఏర్పాటు చేసి, మోసూరువలస రక్షిత నీటి పథకం నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారన్నారు. దీని వల్ల తమ గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీరడం లేదని అన్నారు. పంచాయతీ తీర్మానం చేయకుండానే కార్యదర్శి తన సొంత నిర్ణయంతో ఇలా అనధికారికంగా తాగునీటిని సరఫరా చేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

యువకుడిపై కేసు నమోదు

బొండపల్లి: ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మరొకరితో పెళ్లికి సిద్ధమైన యువకుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణరావు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి, శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి మండలం కొండభీమపురం గ్రామానికి చెందిన తుంపల్లి డిల్లీశ్వరరావు విజయవాడలో 2021 సంవత్సరంలో ఒక కంపెనీలో పనిచేసేవారు. ఆ సమయంలో వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని ఢిల్లీశ్వరరావు నమ్మించాడు. కానీ తనను కాకుండా వేరే యువతితో పెళ్లికి సిద్ధం కావడంతో బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదుచేసి యువకుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గుర్ల, మార్చి 27: మండలంలోని ఎస్ఆర్‌పేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల నుంచి విజయనగరం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న రమేష్, విజయనగరం నుంచి చీపురుపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న అప్పలనాయుడు ఎదురెదురుగా వస్తూ ఎస్ఆర్.పేట వద్ద బలంగా ఢీకొన్నారు. దీంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు ఇద్దరినీ 108 వాహనంపై విజయనగరం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ భాస్కరనాయుడు తెలిపారు.

గడ్డివాముల దగ్ధంపై కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని జే.గుమడాంలో మంగళవారం మధ్యాహ్నం గడ్డి వాములు దగ్ధమైన ఘటనకు సంబంధించి బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కే.లక్ష్మణరావు బుధవారం తెలిపారు. గ్రా మానికి చెందిన రైతు మోపాడ శ్రీనివాసరావుకు చెందిన 15 గడ్డివాములు దగ్ధమవడానికి గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి మహేష్ కారణమని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ ఆత్మహత్య

భోగాపురం: మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన పిడుగు శాంతమ్మ(55) భర్తతో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వీరికి పిల్లలు లేరు. ఇటీవల శాంతమ్మకు ఆవు పొడవడంతో అనారోగ్యం పాలయ్యింది. తాగుడుకు బానిసైన భర్త నిత్యం వేధిస్తుండడం, పిల్లలు లేరన్న బాధ, వీటికి అనారోగ్యం కూడా తోడవడంతో శాంతమ్మ జీవితంపై విరక్తి చెందింది. దీంతో మంగళవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని గమనించిన స్థానికులు విజయనగరం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై భర్త పిడుగు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తవుడు తెలిపారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

వంగర: మండలంలోని వీవీఆర్‌పేటలో మంగళవారం అర్ధరాత్రి దాడులు చేసి 170 సారాప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు రాజాం ఎస్ఈబీ ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలి పారు. ఇద్దరు వ్యక్తులు గామంలోకి ద్విచక్ర వాహనంపై ఒడిశా నుంచి సారా తీసుకుచ్చి అమ్మకాలు సాగిస్తున్నారని సమా చారంతో దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులను బుధవారం కోర్టుకు తరలించి, ద్విచక్రవాహనం సీజ్ చేసినట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

తెర్లాం: ఉద్దవోలులో డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్ మరణించిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కుటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన బుధవారం ఉదయం శ్రీకాంత్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అమరాపు సురేష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు చోరీ కేసులో జైలుశిక్ష

విజయనగరం (క్రైమ్): జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2022లో ఏటీఎం కార్డు మార్చి ఓ వ్యక్తిని మోసగించిన కేసులో నిందితునికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ అడిషినల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బి.రమ్య తీర్పును వెల్లడించినట్లు వన్‌టౌన్ సి.ఐ. వెంకటరావు బుధవారం తెలిపారు. 2022 జనవరి 24న ఎస్.బి.ఐ. మెయిన్ బ్రాంచ్ సమీపంలోని ఏటీఎం కేంద్రంలో మెంటాడ మండలం జయతి గ్రామానికి చెందిన ధాత్రాజు మల్లిస్వామి నగదు డ్రా చేసేందుకు వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తి సాయం తీసుకున్నాడు. ఆ వ్యక్తి మల్లిస్వామి చెప్పిన పిన్ నెంబర్ గుర్తుపెట్టుకుని నగదు విత్‌డ్రా చేసుకున్న తరువాత అసలు ఏటీఎం కార్డుకు బదులు వేరే కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. నిందితుడు వేర్వేరు ఏటీఎం కేంద్రాల్లో మల్లిస్వామి ఖాతా నుంచి 5 విడతలుగా రూ.86వేల 750 నగదును డ్రా చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు గుంటూరుకు చెందిన కె.విద్యాసాగర్‌గా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం అంగీకరించాడు. కోర్టులో నేరారోపణలు రుజువు కావటంతో నిందితుడు విద్యాసాగర్‌కు న్యాయాధికారి జైలు శిక్ష విధించినట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

విజయనగరం క్రైం: గాజులరేగలో పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.15,015 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కోరాడ రామారావు తెలిపారు. అశోక్‌నగర్ ప్రాంతంలో 12 మద్యం సీసాలు, వైఎస్సార్ నగర్‌లో 180 సీసాలు స్వాధీనం చేసుకుని వ్యక్తిని ఆదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ దుర్గాప్రసాద్, ఏఎస్‌ఐ పైడితల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరం

వైసీపీలో భారీ కుదుపు

టీడీపీ గూటికి మాజీ ఎంపీపీ మక్కువ శ్రీధర్?

విజయనగరం (ఆంధ్రజ్యోతి): గజపతినగ రం వైసీపీలో భారీ కుదుపు చోటుచేసుకోనుంది. మాజీ ఎంపీపీ మక్కువ శ్రీధర్ త్వరలో టీడీపీ గూటికి చేరనున్నారు. అతనితో పాటు నియోజవ ర్గంలోని పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీ సీలు, కార్యకర్తలు భారీగా టీడీపీ తీర్థం పుచ్చు కోనున్నారు. లోగిశ గ్రామానికి చెందిన మక్కువ శ్రీధర్ తండ్రి 20 ఏళ్లకుపైగా సర్పంచ్‌గా సేవ లందించారు. శ్రీధర్ రెండుసార్లు జెడ్పీటీసీగా, ఓసారి ఎంపీపీగా సేవలందించారు. గతంలో కూడా ఆయన టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రస్తు త ఎమ్మెల్యే బొత్స అప్ప లనర్సయ్య తగిన గుర్తింపు ఇవ్వకపోవటంతో కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీధర్ వైసీపీకి రాజీనామా చేసి త్వరలో టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

సాలూరుకు మంత్రి ఏమి చేశారు?

● నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి



మొక్కజొన్న రైతుల కష్టాలను తెలుసుకుంటున్న సంధ్యారాణి

సాలూరు రూరల్: సాలూరుకు 18 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, ప్రస్తుతం గిరిజనశాఖ మంత్రిగా ఉన్న పీడిక రాజన్నదొర సాలూరుకేమి చేశారని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నించారు. పట్టుచెన్నారు పంచాయతీ డి.వెలగవలస, చెన్నూరు, కొత్తూరు తదితర గ్రామాల్లో బుధవారం ఆమె ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ చేశారు. మొక్కజొన్న సాగు చేసిన గిరిజన రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. చెన్నూరులో పలువురు గిరిజనులు ఆమెకు స్వాగతం పలికి టీడీపీకి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. చెన్నూరుకు ప్రభుత్వపరంగా తాగునీరు సౌకర్యం లేక పోవడం దారుణమన్నారు. తాను గెలిచిన వెంటనే పనసవలస, చెన్నూరు తదితర గ్రామాలకు రోడ్లు, తాగునీరు, ఇళ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, అక్యాన తిరుపతిరావు, లక్ష్మణ, సతీష్, కృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి.. అహంకారానికి ప్రతిరూపం

● పార్వతీపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి విజయచంద్ర



మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కాకినాడలోని పెద్ద శివాలయంలో అర్చకులపై అధికార పార్టీ నాయకులు దాడి చేయడం దారుణమని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి బోనెలవిజయచంద్ర పేర్కొన్నారు. బుధవారం పార్వతీపురంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దేవుడి సేవలో ఉన్న అర్చకులపై దాడికి తెగించడం అధికార పార్టీ నాయకుల అహంకారానికి ప్రతిరూపమన్నారు. అధికార పార్టీ నాయకులు వారి అధికారాన్ని చూసుకుని విచ్చల విడిగా వ్యవహరిస్తున్నారని, త్వరలోనే ప్రజలు వీరికి ఓట్లు ద్వారా తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం తథ్యమన్నారు. వలంటీర్లకు విద్యార్హతను బట్టి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు వారికి సమాజంలో గౌరవమైన స్థానాన్ని అందించే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారన్నారు. వైసీపీ తన స్వార్థం కోసం వలంటీర్లను పార్టీ సేవలకు వినియోగించుకుంటోందని ఆయన ఆరోపించారు. వలంటీర్ల వ్యవస్థకు చంద్రబాబు వ్యతిరేకం కాదన్నారు. రూ.5వేలు జీతం ఇచ్చి వైసీపీ తన పార్టీ పనులను చేయించుకోవడంతో పాటు వారిని అన్నివిధాలా ఉపయోగించుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఎన్నికల ఫిర్యాదు కోసం కంట్రోల్ రూం

కురుపాం: కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు నియోజకవర్గ ప్రజల కోసం కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నెంబర్ 08963 229298 ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎ.వెంకటరమణ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పీవోలకు ఈవీఎంలపై అవగాహన



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హేమలత

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన సంక్షేమ ప్రతిభ జూనియర్ కళాశాలలో బుధవారం పీవో, ఏపీవోలకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమలత పాల్గొన్నారు. ఈ అవగాహనలో ఎంఆర్‌వో ఒ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున ప్రతిఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలని ఎంపీడీవో ఎంటీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో రాజకీయపార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీలు, జెండాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మక్కువలో వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

మక్కువ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక చర్చి సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రానికి చేరుకునే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ద్విచక్ర వాహనాల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేస్తున్నారు. మద్యం, నగదు తరలింపుపై సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు.

కూనేరు చెక్‌పోస్టు వద్ద..

కొమరాడ: ఒడిశా నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఐదు కిలోల గంజాయి పట్టుకున్నట్లు తెలిసింది. బుధవారం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని కూనేరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాయగడ వైపు నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సులో గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు ఓ వ్యక్తి పట్టు పడినట్లు తెలిసింది. ఈనెల ఐదోతేదీన కూడా మూడు కిలోల గంజాయితో ఇద్దరు మైనర్లు పట్టుబడిన విషయం విదితమే. వీరు కూడా ఒడిశా నుంచి గంజాయిని ప్రైవేట్ బస్సులో తీసుకువస్తుండగా పోలీసులు తనిఖీలలో పట్టుబడ్డారు. ఒడిశా, ఛతీస్‌గఢ్ నుంచి తీసుకు వస్తున్న గంజాయిని విశాఖపట్నంలో విక్రయిస్తున్నట్లు సమాచారం. కొంతకాలంగా ఈ రహదారి గుండా మత్తు పదార్థులు అక్రమ రవాణా జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు మత్తు పదార్థాల అక్రమరవాణాపై మరింత నిఘా పెంచాలని కోరుతున్నారు.

నేడు బత్తిలిలో శివలింగాల ప్రతిష్ఠ

భామిని: మండలంలోని బత్తిలి లలిత త్రిపురసుందరి దేవాలయం ఆవరణలో అష్టోత్తర శత శివలింగాలు ప్రతిష్ఠామహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా మంగళ, బుధవారాల్లో గ్రామ ప్రదర్శన, ఊరేగింపు, దంపతులు ప్రత్యేక పూజలు వంటి కార్య క్రమాలు వేద పండితులు రంపా శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ప్రతిష్ఠ పురస్కరించుకుని భక్తులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



భామిని: పరీక్ష అనంతరం వీడ్కోలు చెప్పుకుంటున్న విద్యార్థినులు



వీరఘట్టం: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉత్సాహం..ఉద్విగ్నం

● ముగిసిన పదో తరగతి పరీక్షలు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా పరీక్షలు రాసి బయటకు వచ్చిన విద్యార్థుల్లో ఉత్సాహం, ఉద్విగ్న వాతావరణం కనిపించింది. ఐదేళ్లు ఒకేచోట కలిసి చదువుకున్న వారంతా విడిపోతుండడంతో వీడ్కోలు చెప్పుకున్న సమయంలో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. పరీక్షలు చక్కగా రాసిన వారంతా ఇంటర్‌లో చేరేందుకు ఉత్సాహంగా ఇళ్లకు బయలు దేరారు.

● **వీరఘట్టం:** వీరఘట్టం బాలబాలికల జడ్పీ ఉన్నతపాఠశాలలు, బిటివాడ జడ్పీ, నీలానగరం జీటీడబ్ల్యుఏఎం స్కూల్, గంగం పేటలో బుధవారంతో పదో తరగతి పరీక్షలు ముగిశాయని ఎంఈవోలు ఆనందరావు, గౌరు నాయుడు తెలిపారు. ● **భామిని:** భామిని ఆదర్శ పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, బత్తిలి జడ్పీ పాఠశాల కేంద్రాల్లో 485 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఎగ్జామ్ చీఫ్‌లు ఆర్‌వీ రమణ, విజయనిర్మల, వెంకటరావు తెలిపారు.

రక్షణ గోడలు మరమ్మతులకు నోచుకోక..

● శిథిలావస్థకు చేరడంతో పొంచిఉన్న ప్రమాదం

● ఇదీ మక్కువ వద్ద సువర్ణముఖి నది వంతెనపై పరిస్థితి



సువర్ణముఖి నది వంతెనపై రక్షణగోడలు లేని దృశ్యం

మక్కువ: మక్కువ వద్ద సువర్ణముఖి నదిపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రక్షణ గోడలు దెబ్బతినడంతో తర్వాత కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో తితలీ తుఫాన్ సమయంలో వెంగళరాయ సాగర్ జలాశయం పూర్తిగా నిండిపోవడంతో అన్ని ప్రధాన గేట్లు తెరిచి, సువర్ణముఖి నదిలోకి నీరు విడిచిపెట్టిన విషయం విదితమే.దీంతో వంతెన పైనుంచి నీరు ప్రవహించడంతో రక్షణ గోడలు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం రక్షణ గోడలు లేక పోవడంతో ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అదికారులు దృష్టి సారించడం లేదు.ఈ మార్గంలో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వాహనాలు అదుపు తప్పితే నదిలోకి పడిపోయేఅవకాశముందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు వంతెనపై రోడ్డు కూడా గోతులమయంగా మారడంతో వర్షం పడితే గోతుల్లో నీరు చేరుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి వంతెనపై రక్షణ గోడలను నిర్మించి, వంతెనకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మక్కువలో ట్రాఫిక్ సమస్య

● వాహన చోదకులు, ప్రయాణికులకు తప్పని అవస్థలు



రోడ్డుపైనే నిలిపివేసిన వాహనాలు

మక్కువ: మక్కువలో నిత్యం ట్రాఫిక్‌సమస్య వేధిస్తోంది. దశాబ్దాల కిందట నిర్మించిన ఇరుకు రోడ్లు కావడం, ప్రస్తుతం వాహనాల పెరగడంతో ప్రతిరోజూ అవస్థలు తప్పడంలేదు. పెరుగుతున్న జనాభా రద్దీకి అనుగుణంగా రోడ్లు విస్తరించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోందని పలువురు చెబుతున్నారు. మక్కువ మండల కేంద్రం కావడంతో పలు గ్రామాల నుంచి వందలాది మంది వివిధ కార్యాలయాలు, వ్యాపారాల నిమిత్తం వస్తున్నారు. వారంతా పార్కింగ్ లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. సాయంత్రం ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. ప్రధానంగా ఆ సమయంలో రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండడంతో మెయిన్‌రోడ్డు జంక్షన్‌కు వెళ్లే వాహనచోదకులు, ప్రయాణికులకు నరకయాతన తప్పడం లేదు. ఇప్పటికైనా సాయంత్రం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా పోలీసులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి



విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న చింతగడ దాస్

సాలూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతగడ దాస్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు బొడ్డవలసలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో 11వ వార్డు మాజీ కౌన్సిలర్ అప్పారావు, నాలుగో వార్డు కౌన్సిలర్ వరప్రసాద్‌రావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ గోదాముల పరిశీలన



గోదాములోని స్టాక్‌ను పరిశీలిస్తున్న శివ ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలోని ఎంఎల్ఎస్ గోదాములను పార్వతీపురం మన్యం జిల్లా పౌరసరఫరాల అధికారి శివ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఎన్నికల నిబంధన మేరకు గోధుమపిండి, బియ్యం తదితర ప్యాకెట్లపై ప్రభుత్వ ప్రచార లోగోలపై స్టిక్కర్లు అంటించినది లేనిది తనిఖీచేశారు. అనంతరం స్టాక్ బ్యాలెన్స్‌లను సరిచూసి, రికార్డులు పరిశీలించారు. జీసీసీ గోదాము ఇన్‌చార్జి సాంబశివరావు వీరికి రికార్డులు చూపించారు.

100 మంది రక్తదానం

పార్వతీపురంటౌన్: సినీ నటుడు రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో మెగా ఫ్యామిలీ సేవా సంఘం అధ్యక్షుడు ఆర్.రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.చంటి, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది అభిమానులు రక్తదానం చేశారు.

పోలమాంబ ఆలయ హుండీల లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మక్కువ: శంబర పోలమాంబ ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. చదురు గుడిలో రూ.6,43,945, వనం గుడిలో రూ.2,24,004 మొత్తం రూ. 8,67,951 ఆదాయం వచ్చింది. వెండి 158 గ్రాములు, బంగారం మూడు గ్రాములు వచ్చింది. హుండీ లెక్కింపు కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లా దేవదాయశాఖ అధికారి, జాతర ప్రత్యేకాధికారి డీవీవీ ప్రసాదరావు, ఆలయ కార్య నిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ, ఎంపీటీసీ తీల్ల పోలినాయుడు, దాలినాయుడు, పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

● సీపీఎం జిల్లా నాయకులు తిరుపతిరావు, అవినాష్



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గం వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు తిరుపతిరావు, అవినాష్ కోరారు. బుధవారంగుమ్మలక్ష్మీపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సీపీఎం నాయకులు వైసీపీలో చేరినట్టు ధ్రువీకరించనట్టు ప్రకటించడం దురదృష్టకరమన్నారు. ఎవరుచేరారో వారి పేర్లు చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తన తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హితవుపలికారు. వైసీపీ కార్యకర్తలనే కండువాలు వేసి ఇతర పార్టీల వారు తమ పార్టీలోకి వస్తున్నట్టు ప్రచారం చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందని తెలిపారు. సమావేశంలో మనం రమణ పాల్గొన్నారు.

జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యుల ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ గిరిజన గురుకుల జూనియర్ కళాశాల ప్రభుత్వ గిరిజన పీటీజీ బాలికల పాఠశాల విద్యార్థినుల్లో కొందరిని రాష్ట్ర గవర్నర్ కార్యాలయం ఆదేశాల మేరకు జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులుగా గుర్తించారు. ఈమేరకు బుధవారం భద్రగిరిలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో ఎంపికైన విద్యార్థినులకు జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులుగా ఐడీ కార్డు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. వీరికి ఫస్ట్ ఎయిడ్, ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పైడి కొండలరావు, రెడ్ క్రాస్ సభ్యులు గుడ్ల హరి ప్రసాద్, బేతాకుమారి పాల్గొన్నారు.

ప్రకృతి విధానాలను విస్తరించాలి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానాలను మారుమూల పల్లెలకు విస్తరించాలని రైతు సాధికార సంస్థ సీనియర్ సలహాదారుడు డా.డి.పారినాయుడు సూచించారు. బుధవారం తోటపల్లి జట్టు సంస్థ ప్రాంగణంలో జట్టు సంస్థ ఆధ్వర్యంలో జీవ ప్రాజెక్టు పరిధిలోని రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలం గొరడ, రాయగడ జమ్ము, పెంగువ, వల్లాడ గ్రామాల్లో ప్రత్యేక పైలట్ ప్రాజెక్టుకు అమలు చేస్తున్నామని చెప్పారు. నాబార్డు ఆర్థిక సహకారంతో సంస్థ పర్యవేక్షణలో సుమారు 100 మందికి పైగా రైతులు ప్రకృతి విధానాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర పొందేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం జీవ నిరంతర ఆహారం, ఆరోగ్యం, ఆదాయం విజయ గాధల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జట్టు ప్రకృతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, కోడైరెక్టర్ ఎం.నూకంనాయుడు, జీవ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.ప్రబోద్, జి.మురళీమోహన్‌తో పాటు సీఆర్‌పీలు, రైతులు టి.బంగార్రాజు, కె.జానకి, టి.అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

పాలకొండ: మండలంలోని వెలగవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అగ్నిప్రమాదాలు నివారణపై పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది అవగాహన బుధవారం కల్పించారు. ప్రమాదాలు జరిగే సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదా లకు నివారణకు సంబంధించిన పరికరాల వినియోగాన్ని తెలిపారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరావు, శంకరరావుశర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి గిజబలో ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

గరుగుబిల్లి: గిజబలో నిర్మించిన శివాలయం ప్రతిష్ఠా మహోత్సవాలకు సిద్ధమైంది. తోటపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గిజబ గ్రామంలోని శివాలయం ముంపునకు గురైన విషయం విదితమే. దీంతో ఆలయ నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మం జూరైనా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో విడుదలకు నోచుకోలేదు. ఈనేపథ్యంలో గ్రామంలోని ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సొంత నిధులతో పాటు విరాళాలు సేకరించి నిర్మాణం పూర్తి చేశారు. ఈ మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి మూడోతేదీ వరకు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. 3న ఆలయ శిఖర, యంత్ర, ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రధాన అర్చకులు పూలఖండం రాంబాబుశర్మ పర్యవేక్షణలో శ్రీపతిదుర్గాప్రసాద్‌శర్మ, మణికంఠశర్మతో పాటు సింహాచలం దేవస్థానం వేద పండితులచే కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

భోగాపురం: భోగాపురం గ్రామంలోని బజారు జంక్షన్ సమీపంలో అదే గ్రామానికి చెందిన బొడ్డ అప్పలరాజు అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు సీఐ ఎ.రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

● రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కార్తీక్ అన్నారు. సుంకి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆయన బుధవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పరిసరాలుపరిశుభ్రంగా ఉండాలని, భోజనంచేసే ముందు విధిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఎండలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సమస్యలపై పర్యవేక్షించాలన్నారు. జ్వరాలతో పాటు డయేరియా వంటి వ్యాధులు ఆశించినట్లయితే వైద్య సేవలను పూర్తిస్థాయిలో అందించాలన్నారు.కార్యక్రమంలో సిబ్బంది జి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న కార్తీక్